సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 28 । మే । 2025



వలసదారులూ వెళ్లిపోండి...!

ఉమ్మడి జిల్లా నుంచి వందలాదిగా కార్మికులు విజిట్ వీసాపై మలేషియా వెళ్లారు. అక్కడి ప్రభుత్వం వెళ్లిపోవాలని ఆంక్షలు విధించడంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతుంది. 8లో▸



నేడు ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్

ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్‌కు సంబంధించి ఆర్జీయూకేటీలో ప్రవేశాలకు గాను బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుందని అధికారులు వెల్లడించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములతో కూడిని భారీ వర్షం కరిసే అవకాశం ఉంది.

సాగు సన్నద్ధతపై రేపు సాక్షి ఫోన్‌ఇన్

సాక్షి ఫోన్ ఇన్

ఆదిలాబాద్‌టౌన్: ముందస్తు తొలకరితో అన్నదాత సాగుకు సన్నద్ధం అవుతున్నాడు. ఈ నేపథ్యంలో రైతుల సందేహాల నివృత్తి కోసం 'సాక్షి' నడుం బిగించింది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్‌స్వామితో గురువారం ఫోన్‌ఇన్‌కు శ్రీకారం చుట్టింది. విత్తనాలు, ఎరువుల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు, నకిలీ విత్తనాల బెడద, సాగులో మెలకువలు తదితర అంశాలపై రైతులు ఫోన్ ద్వారా సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

సంప్రదించాల్సిన నంబర్ :
81063 02862
సమయం : ఈనెల 29న
ఉదయం 9 నుంచి 10 గంటల వరకు

కరోనా.. అలర్ట్



- మళ్లీ కోవిడ్ గుబులు
- రిమ్స్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు
- పొరుగున మహారాష్ట్రలో పెరుగుతున్న కేసులు
- భయం వద్దు.. అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యశాఖ

ఆదిలాబాద్‌టౌన్: మళ్లీ కోవిడ్ గుబులు మొదలైంది. దేశంలో కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పొరుగున ఉన్న మహారాష్ట్రలో భారీగా నమోదవుతున్నాయి. ఈనేపథ్యంలో యంత్రాంగం అప్రమత్తమైంది. వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. రిమ్స్‌లో ప్రత్యేక వార్డును అందుబాటులోకి తెచ్చారు. భయపడాల్సిన అవసరం లేదని.. అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

కోవిడ్ సమయంలో జరిగిన నష్టం అంతా ఇంత కాదు. మహమ్మారి బారిన పడి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. కరోనా మిగిల్చిన విషాద ఘటనలెన్నో. ఆ రోజులు గుర్తు చేసుకుంటే చాలు ఒంట్లో గుబులు పుడుతోంది. అలాంటి మహమ్మారి మళ్లీ పంజా విసురుతోంది. పొరుగున ఉన్న మహారాష్ట్రలో బాధితుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలోనూ ఇటీవల ఒక కేసు నమోదైంది. ఇది జిల్లా ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. అయితే భయపడాల్సిన పని లేదని అప్రమత్తంగా ఉంటే కోవిడ్‌ను నిర్మూలించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. మనకు మహారాష్ట్ర అనుకుని ఉండడంతో జిల్లావాసులు, అక్కడి వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే మహమ్మారి బారిన పడకుండా ఉండవచ్చని పేర్కొంటున్నారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

రిమ్స్‌లో ప్రత్యేక వార్డు..

కోవిడ్ మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా వైద్యారోగ్య శాఖతో పాటు రిమ్స్ అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. రిమ్స్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. వైరస్ బారిన పడితే ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందించేందుకు 50 బెడ్లను ఏర్పాటు చేశారు. ఆక్సిజన్, వెంటిలెటర్లు, కన్సల్‌టేటర్లు అందుబాటులో ఉంచారు. ప్రత్యేకంగా వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్సులను నియమించారు.



కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

భయాందోళన వద్దు



కోవిడ్ గురించి ప్రజలు భయభ్రాంతులకు గురికావొద్దు. జిల్లాకు ఎన్ని ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్లు అవసరమనే వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. రిమ్స్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశాం. 50 ఐసోలేషన్ బెడ్లు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచాం. లక్షణాలు ఉంటే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలి.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

అప్రమత్తంగా ఉండాలి



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లక్షణాలుంటే ఐదు రోజుల పాటు ఐసోలేషన్‌లో ఉండాలి. జనావాసాల్లో తిరగొద్దు. గతంలో మాదిరిగా దీని ప్రభావం ప్రస్తుతం అంతగా లేదు. అయినప్పటికీ జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు కోవిడ్ నిబంధనలు పాటించాలి.

– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

న్యూస్‌రీల్

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఎంపికైన అభ్యర్థులు 50 రోజుల పాటు అందించే శిక్షణను సద్వినియోగం చేసుకుని సర్వేయర్‌గా రాణించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. శిక్షణకు అవసరమైన మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల కొలతల్లో సర్వేయర్ల పాత్ర కీలకమన్నారు. శిక్షణలో నేర్చే అంశాలపైపట్టు సాధించాలని సూచించారు. 155 మందిని రెండు బ్యాచ్‌లుగా చేసి థియరీ, ఫీల్డ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లుగా వెల్లడించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వీసీలో పాల్గొన్న కలెక్టర్

సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, వరి ధాన్యం సేకరణ, వ్యవసా యం – మాన్‌సూన్ సంసిద్ధత వంటి అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దే శం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, హౌసింగ్ పీడీ బసవేశ్వర్, డీఎస్‌వో వాజీద్ అలీ, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో 14.26 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు

కైలాస్‌నగర్: జిల్లాలోని 316 విత్తన దుకాణాల్లో పలు కంపెనీలకు చెందిన 14,26,220 హైబ్రిడ్ పత్తి విత్తన ప్యాకెట్లను అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. రైతులు సమీప డీలర్ వద్ద విత్తనాలు కొనే సమయంలో విధిగా రశీదు పొంది, పంటకాలం పూర్తి అయ్యేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయాలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టాస్క్‌ఫోర్స్ సీఐ చంద్రమౌళి 87126 59965, ఏడీఏ కె.శివకుమార్ 8977742854 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



స్టేషన్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ

తలమడుగు: మహారాష్ట్ర సరిహద్దు మండలాల్లో అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌తో పాటు మండలంలోని లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్‌ను మంగళవారం తనిఖీ చేశారు. బక్రీద్ సందర్భంగా జిల్లాలోకి పశువుల అక్రమ రవాణా కాకుండా వివిధ శాఖల సమన్వయంతో చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తించాలన్నారు. స్టేషన్‌లో కేసులు పెండింగ్ లేకుండా చొరవ చూపాలన్నారు. అనంతరం కోసాయి రైల్వేస్టేషన్‌కు చేరుకుని అక్రమ రవాణాపై ఆరా తీసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్సై రాధిక, ఏఎస్సై లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని స్టేడియంలో హాకీ మైదానం



ఖేలో.. ఆదిలాబాద్

- జిల్లా కేంద్రం.. హాకీకి కేరాఫ్‌గా మారేనా
- ఇప్పటికే కేంద్రం నుంచి సెంటర్ మంజూరు
- తాజాగా సింథటిక్ టర్ఫ్ కోర్టు ఏర్పాటుకు ఎంపీ ప్రతిపాదన
- మంజూరైతే ఇక జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదిక



సింథటిక్ కోర్టు నమూనా

ప్రయోజనాలు ఇలా..

- టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేసిన పక్షంలో జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా మారనుంది.
- రానున్న రోజుల్లో ప్రత్యేక అకాడమీ ఏర్పాటుకు కూడా అవకాశాలు ఉంటాయి.
- స్థానికంగా ఔత్సాహికులైన ఎంతో మంది క్రీడాకారులకు మంచి శిక్షణ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.

సాక్షి,ఆదిలాబాద్: మన జాతీయ క్రీడ హాకీకి జిల్లా కేంద్రం కీలకంగా మారనుంది. ఆదిలాబాద్‌లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు వేదిక కానుందా.. అంటే.. అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇప్పటికే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హాకీలో శిక్షణ కోసం ఖేలో ఇండియా సెంటర్ ఏర్పాటు చేయడం తెలిసిందే. ప్రస్తుతం ఈ క్రీడలో అనేక మంది ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. రాష్ట్ర,జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చుతున్నారు. ఇదిలా ఉంటే.. ఆదిలాబాద్‌లో సింథటిక్ టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని తాజాగా కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. మంజూరైతే రానున్న రోజుల్లో జాతీయస్థాయిపోటీలనిర్వహణకు వేదికవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రూ.7 కోట్లతో ప్రతిపాదనలు..

జిల్లా కేంద్రంలో ప్రస్తుతం స్పోర్ట్స్ స్కూల్ కొనసాగుతుంది. అలాగే ఉట్నూర్, జాతర్లలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరి క్రీడా పాఠశాలలు నిర్వహిస్తున్నారు. ఇందులోని విద్యార్థులు పలువురు హాకీలో శిక్షణ పొందుతున్నారు. అంతేకాకుండా జిల్లాకేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాల, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు సైతం ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఇటీవల జిల్లా నుంచి గజానంద్, రాంకుమార్ ఇద్దరు జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో రానున్న రోజుల్లో ఈ క్రీడాభివృద్ధికి అవకాశాలు మెరుగుపడనున్నాయి. ఇదిలా ఉంటే స్థానిక ఎంపీ నగేశ్ తాజాగా కేంద్ర క్రీడలశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు హాకీ కోసం ఆదిలాబాద్‌లో రూ.7 కోట్లతో సింథటిక్ టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. ఈ ఏడాది చివరిలోగా దీనికి మంజూరు లభించే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

పట్టు వదలొద్దు..

జిల్లాలో క్రీడల అభివృద్ధి పరంగా నేతలు, అధికారులు పట్టువదలకుండా కృషి చేయాలన్న అభిప్రాయం పలువురి నుంచి వ్యక్తమవుతుంది. ప్రధానంగా ఆదిలాబాద్‌కు గతంలోనే ఫుట్‌బాల్ అకాడమీ మంజూరై ప్రారంభించబడింది. కొద్ది కాలం పాటు ఇక్కడ శిక్షణ కూడా కొనసాగింది. అయితే మధ్యలో దీన్ని ఖమ్మంకు తరలించారు. దీంతో ఆదిలా బాద్‌కు అన్యాయం జరిగిందన్న అభిప్రాయం, ఆవేదన ఈ ప్రాంతవాసుల్లో వ్యక్తమైంది. ఆ తర్వాత ఆదిలాబాద్‌కు స్పోర్ట్స్ స్కూల్ మంజూరు చేశారు. ప్రస్తుతం హాకీ సెంటర్ కొనసాగుతుండగా, ఫోకస్ పెంచితే మరింత అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు.

ప్రతిపాదనలు పంపాం



ఆదిలాబాద్‌లోని హాకీ మైదానంలో టర్ఫ్ కోర్టు ఏర్పాటు చేయాలని కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవియాకు ప్రతిపాదన చేశాను. రానున్న రోజుల్లో ఇది మంజూరవుతుంది.

– గోడం నగేశ్, ఎంపీ, ఆదిలాబాద్

అథ్లెటిక్ ట్రాక్ కోసం కూడా..



ఆదిలాబాద్ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన పంపాం. దానికి కూడా మంజూరు వచ్చే అవకాశం ఉంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, తెలంగాణ రాష్ట్ర క్రీడ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో క్రీడల అభివృద్ధి కోసం తోడ్పాటు అందిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు..



ఆదిలాబాద్‌లో హాకీ క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంది. అనేక మంది గిరిజన విద్యార్థులు ఈ క్రీడపై మక్కువ చూపుతున్నారు. ఇటీవల ఇద్దరు జాతీయ స్థాయిలో రాణించడమే ఇందుకు నిదర్శనం. ఖేలో ఇండియా హాకీ సెంటర్‌కు ఆస్ట్రో టర్ఫ్ ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నాం. గతంలో రూ.30 లక్షలతో స్టేడియంలో హాకీ కోసం ప్రత్యేక మైదానం ఏర్పాటు చేయడం జరిగింది.

– బి.గోవర్ధన్ రెడ్డి, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

నకిలీ బెడద

- బేల మండలం సిర్సన్న గ్రామంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న గ్రామానికి చెందిన ఎండీ కుర్షీద్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈనెల 25న దాడి చేసి పట్టుకున్నారు. అతడి నుంచి 10 కిలోల లూజ్ విత్తనాలు, 26 నకిలీ విత్తన ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని మహారాష్ట్ర నుంచి తీసుకొచ్చి అమాయక ఆదివాసీ రైతులకు అంటగడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.
- ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్, కోకస్ మన్నూర్ గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ పోలీసులు ఈనెల 24న దాడులు చేసి 27 నకిలీ విత్తన ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు చోట్లనే కాదు జిల్లాలోని మారుమూల సరిహద్దు ప్రాంత గ్రామాల్లో ఈ నకిలీ దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.

- రైతుల్లో కల్తీ విత్తన గుబులు
- జిల్లాలో గుట్టుగా లూజ్ దందా
- దాడులు చేసినా ఆగని వ్యాపారం
- అధికారులకు సవాల్‌గా మారిన వైనం



సిర్సన్న గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలను ఇటీవల పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల బెడద మొదలైంది. ఏవి మంచివో.. ఏవి నకిలీవో తెలియక రైతులు సతమతమవుతున్నారు. ఇటీవల జిల్లాలో వరుసగా పట్టుబడుతున్న నకిలీ విత్తనాల ఘటనలే ఇందుకు నిదర్శనం.

ప్యాకెట్లు, లూజ్‌గా..

నకిలీ పత్తి విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు అక్రమార్కులు ఓ విధానాన్ని ఎంచుకున్నారు. ప్యాకింగ్ చేసిన విత్తనాలతో పాటు లూజ్‌గా (కిలోల చొప్పున) అమ్మితే ఎలాంటి అనుమానం రాకుండా ఉంటుందని భావిస్తున్నారు. ఒకవేళ లూజ్ కాకుండా మొత్తం ప్యాకింగ్ చేసి అమ్మితే సరైన లేబుల్, కంపెనీ పేరు, విత్తన రకం , ఎక్స్‌పైరీ తేదీ వంటి వివరాలు తప్పనిసరిగా పేర్కొనాలి. విత్తనాలు కొన్న రైతుకు సదరు డీలర్‌కు చెందిన ట్రేడర్ లేటర్ హెడ్‌పై సంతకం చేసి రశీదు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా చేస్తే ఆ విత్తనాలు ఎక్కడి నుంచి వచ్చాయనే వివరాలు రైతులతో పాటు అధికారులకు కూడా స్పష్టంగా తెలుస్తాయి. ఫలితంగా ఆ విత్తనాలు నకిలీవైతే సదరు కంపెనీపై చర్యలు తీసుకునే ఆస్కారం ఉంటుంది. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్న ఓ విత్తన ప్యాకెట్ (245 గ్రాములు) ధర రూ.880 నుంచి రూ.930 గా ఉంది. అలా కాకుండా రైతులకు కొందరు తక్కువ ధరకే నకిలీ ప్యాకెట్లు, లూజ్ విత్తనాలు అమ్మి సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు.

జిల్లాలో నకిలీ బెడద..

ఆదిలాబాద్ జిల్లా.. నిర్మల్, ఆసిఫాబాద్‌తో పాటు ఎక్కువగా మహారాష్ట్ర సరిహద్దును కలిగి ఉంది. దీంతో నలుదిక్కులా నిఘా పెట్టి నకిలీ విత్తనాలు హద్దు దాటి రాకుండా యంత్రాంగం కాపుకాస్తోంది. ఇందులో భాగంగానే టాస్క్‌ఫోర్స్, పోలీసు, వ్యవసాయ అధికారులు సరిహద్దు గ్రామాలు, చెక్‌పోస్టులు, బహిరంగ వ్యాపార సముదాయాలపై అనుక్షణం ఓ కన్నేసి ఉంచుతున్నారు. కొన్నిచోట్ల అనుమానం వచ్చిన లైసెన్స్ విత్తన దుకాణాల్లో సైతం తనిఖీలు చేస్తూ రైతులకు నకిలీపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ముందస్తు సమాచారం మేరకు ఇటీవల ఇచ్చోడ, బేల మండలాల్లో తనిఖీలు చేశారు. లూజ్, ప్యాకెట్ నకిలీ పత్తి విత్తనాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

అమాయక రైతులే టార్గెట్..

ముందస్తు తొలకరితో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి. రైతులు సాగు పనుల్లో బిజీగా మారారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు జిల్లాలోని అమాయక, ఆదివాసీ రైతులే టార్గెట్‌గా నకిలీ విత్తనాల దందా కొనసాగిస్తున్నారు. రైతులకు మాయమాటలు చెప్పి తక్కువ ధరకు అంటగడుతున్నారు. తద్వారా పంట దిగుబడి రాక రైతులు నష్టపోతున్నారు. ఏటా ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్న నేపథ్యంలో అధికారులు మరింత నిఘా పెంచాలనే డిమాండ్ రైతుల నుంచి వినిపిస్తోంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసులు..

నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తాం. అలాగే లూజ్, నకిలీ విత్తనాలను రైతులు కొనుగోలు చేయవద్దు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేసి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి. అంతర్ జిల్లా, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాం. డిమాండ్ సీడ్స్ జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు తరలకుండా, ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు సీడ్స్ రాకుండా తనిఖీలు చేపడుతున్నాం. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

ఆ సైలెన్సర్లు వాడొద్దు

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు బిగించడంతో చిన్నారులు, వృద్ధులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని వాడిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. నెలరోజుల పాటు జిల్లా కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సీజ్ చేసిన 160 మోడిఫైడ్ సైలెన్సర్లను జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ ఎదుట మంగళవారం రోడ్‌రోలర్‌తో తొక్కించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లను వాహనాలకు బిగించవద్దని, కంపెనీ సైలెన్సర్లను మాత్రమే వాడాలని సూచించారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై ఇకనుంచి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే మెకానిక్‌లు వాహనాలకు మోడిఫైడ్ సైలెన్సర్లు బిగించవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు సునిల్ కుమార్, కరుణాకర్‌రావు, ట్రాఫిక్ సీఐ ప్రణయ్‌కుమార్, ఎస్సైలు మహేందర్, దేవేందర్, సిబ్బంది రాజేశ్, రామకృష్ణ, రమేశ్, ఫేరోజ్, విజయ్, సతీష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



సైలెన్సర్లను రోడ్‌రోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ

జోరు వాన

- జిల్లాలో మరో రెండు రోజులు ఇదే పరిస్థితి
- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తిప్పలు

కైలాస్‌నగర్: నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. మరోవైపు అల్పపీడనం సైతం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో జిల్లాలో పలు మండలాల్లో మంగళవారం ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదిలాబాద్‌లో మధ్యాహ్నం 2.30గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన వాన మొదలైంది.గంటన్నర పాటు ఏకధాటిగా కురవడంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయయ్యాయి. అంబేడ్కర్‌చౌక్, పంజాబ్‌చౌక్‌లతో పాటు రాంనగర్‌లోని రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచింది. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. వికలాంగుల కాలనీలో వరదనీరు ఇళ్లలోకి చేరింది. జైనథ్‌లోనూ లోతట్టుప్రాంతాలు జలమయమ య్యాయి. ఇంద్రవెల్లి, బోథ్, భీంపూర్, బజార్‌హత్నూర్, ఉట్నూర్‌లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగతా మండలాల్లో మోస్తారు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇంద్రవెల్లి, గాదిగూడ మండలాల్లో కురిసిన వర్షానికి ఇంటిపైకప్పులు లేచిపోయాయి. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల చెట్లు విరిగిపడగా, స్తంభాలు నెలకొరిగాయి. పొల్లుగూడలోని పెర్సపేన్ ఆలయంపై పిడుగు పడింది. అలాగే జొన్నల కొనుగోలు కేంద్రాల్లో విక్రయానికి తీసుకువచ్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కాగా మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు.



రాంనగర్‌లో రహదారిపై నిలిచిన వర్షపునీరు

జిల్లాలో మంగళవారం నమోదైన వర్షపాతం వివరాలు(మిల్లీమీటర్లలో)

మండలం	నమోదైన వర్షపాతం
జైనథ్	70.5
ఆదిలాబాద్ అర్బన్	69.0
ఇచ్చోడ	44.5
మావల	37.5
గుడిహత్నూర్	18.03
ఇంద్రవెల్లి	15.0
బోథ్	5.5
భీంపూర్	5.0
బజార్‌హత్నూర్	4.8
ఉట్నూర్	4.5
జైనథ్	2.3
నార్నూర్	1.5
తలమడుగు	0.8

క్లుప్తంగా

గంజాయి మొక్కలు స్వాధీనం

సిరికొండ: మండలంలోని లక్ష్మీపూర్ శివారులో ఓ రైతు తన చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ముందస్తు సమాచారం మేరకు మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. మొక్కల విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. గంజాయి మొక్కలు సాగు చేస్తున్న బోరింగ్ గూడ గ్రామానికి చెందిన రైతుపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ట్రాఫిక్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఈనెల 4న పంజాబ్‌చౌక్‌లో ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా బేల మండలంలోని సాంగిడి గ్రామానికి చెందిన సద్దే నితీష్ వారితో వాగ్వివాదానికి దిగాడు. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఇంజినీరింగ్ కాలేజీలో సీట్లు

శ్రీరాంపూర్: కొత్తగూడెంలోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ (కేయూ)లో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రత్యేక సీట్లు కేటాయించినట్లు శ్రీరాంపూర్ డీజీఎం (పర్సనల్) అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి ఉద్యోగులతో పాటు అధికారుల పిల్లలకు ఇందులో మొత్తం 10 సీట్లు కేటాయించారన్నారు. మైనింగ్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఈఈఈ, ఈసీఈలో రెండు చొప్పున సీట్లు కేటాయించినట్లు తెలిపారు. దీనికి గానూ ప్రభుత్వం నిర్వహించిన టీజీ ఈఏపీ సెట్‌లో అర్హత సాధించాలన్నారు. మార్కులు, ర్యాంకుల ఆధారంగా మెరిట్ లిస్టు ప్రకారం సీట్లు కేటాయించబడుతాయన్నారు. మరిన్ని వివరాలకు పర్సనల్ డిపార్టుమెంట్ నందు సంప్రదించాలని ఆయన సూచించారు.

పెర్సపేన్ ఆలయంపై పిడుగు


ధ్వంసమైన ఆలయ గోపురం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి పొల్లుగూడలో జుగ్నాక్ వంశీయుల కులదైవమైన (పెర్సపేన్) ఆలయంపై పిడుగు పడింది. దీంతో ఆలయ గోపురం ధ్వంసం కావడమే కాకుండా కలశం ఊడిపోయిందని గ్రామస్తులు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రం క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రాజేశ్ తెలిపారు. జూనియర్ గర్ల్స్ విభాగంలో క్రితి అగర్వాల్ (50–52 కేజీలు), జూనియర్ బాయ్స్ కేటగిరీలో (48– 50 కేజీలు) ఎండి ఉబైద్ ఖాన్ జాతీయస్థాయికి ఎంపికయ్యారన్నారు. జూన్ 4 నుంచి 7 వరకు గోవాలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.

వలసదారులూ వెళ్లిపోండి...!

- దేశం విడిచి వెళ్లాలని మలేషియా ప్రభుత్వం ఆంక్షలు
- నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న వారికి క్షమాభిక్ష పథకం అమలు
- ఉమ్మడి జిల్లాలోని వలస కార్మికుల్లో ఆందోళన



మలేషియాలో భారతీయ వలస కార్మికులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: బతుకుదెరువుకోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి వందలాది మంది కార్మికులు విజిట్ వీసాపై మలేషియా వెళ్లారు. కానీ అక్కడి ప్రభుత్వం వలస కార్మికులను తిరిగి వెళ్లి పోవాలని ఆంక్షలు విధించడంతో ఆందోళన చెందుతున్నారు. వీసా నిబంధనలకు విరుద్ధంగా విజిట్ వీసాపై వచ్చి అక్రమ వలసదారులుగా ఉంటున్న వారిని తక్షణమే స్వదేశాలకు వెళ్లిపోవాలంటూ అక్కడి ప్రభుత్వం తాజాగా 'క్షమాభిక్ష' (ఆమ్నెస్టీ) పథకం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం మలేషియా దేశంలో పాస్‌పోర్ట్ లేకుండా ఉన్నవారితో పాటు తాత్కాలిక వర్క్ వీసాలు, విజిట్ పర్మిట్ వంటివి గడువు ముగిసినా అక్కడే తలదాచుకుంటున్న వలస కార్మికులు వెళ్లిపోవాలని ఆదేశాలు ఇచ్చింది. క్షమాభిక్ష పథకం ద్వారా తమ స్వదేశాలకు వెళ్లేవారు ఎటువంటి జైలు శిక్ష లేకుండానే 500 రింగిట్లు, మనదేశ కరెన్సీలో రూ.10వేలు జరిమానా చెల్లించి తిరిగి స్వదేశానికి రావాల్సి ఉంటుంది. పాస్‌పోర్టు ఉన్నప్పటికీ, వీసా గడువు ముగిసిన వారితో పాటు, వీసాలు లేని వారందరినీ ఎమర్జెన్సీ ట్రావెల్ సర్టిఫికెట్ ఆధారంగా పక్షం రోజుల్లో రిటర్న్ జర్నీకి అవకాశం కల్పించింది. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్న వలసదారులందరూ మలేషియాలోని లాబువాన్ ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంటు డివిజన్ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించింది.

ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 500 మంది..

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధి కోసం మలేషియా వెళ్లిన వారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 500 మంది వరకు ఉండవచ్చని ఎన్ఆర్ఐ రాష్ట్ర కమిటీ అడ్వైజరీ మెంబర్ స్వదేశ్ పరికిపండ్ల పేర్కొంటున్నారు. ఉపాధి కోసం పొట్టచేత పట్టుకుని వెళ్లిన వారంతా తాజా నిబంధనలతో స్వస్థలాలకు తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల నుంచి కూడా వేలాది మంది మలేషియాలో ఉపాధి పొందుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలైన దుబాయ్, మస్కట్, బహ్రెయిన్, సౌదీ అరేబియా దేశాలతో పాటు మలేషియా కూడా వెళ్తున్నారు. ఈ క్రమంలో మలేషియాలో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 2,500 మంది వరకు ఉండగా తాజా నిబంధనలతో అందులో 500 మంది స్వదేశాలకు తిరిగి రావాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దీనికి గడువు 2026, ఏప్రిల్ 30 వరకు నిర్దేశించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని వలస కార్మికుల కుటుంబాల్లో ఆందోళనలు నెలకొంటున్నాయి.

నేడు ట్రిపుల్ ఐటీ నోటిఫికేషన్



- ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్న అధికారులు
- ప్రభుత్వం నుంచి ప్రవేశాలకు గ్రీన్ సిగ్నల్

భైంసా: ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్‌కు సంబంధించి ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాల ప్రక్రియపై ట్రిపుల్‌ఐటీ అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నోటిఫికేషన్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు వివరాలు, చివరి తేది, కౌన్సిలింగ్ వివరాలు పొందుపర్చనున్నారు. పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్ల కోసం దరఖాస్తు చేస్తుంటారు.

విద్యా విధానం...

ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో తొలి రెండేళ్లు ఇంటర్ సమానమైన పీయూసీ కోర్సు, నాలుగేళ్లు బీటెక్ కోర్సు ఉంటుంది. పీయూసీలో విద్యార్థుల విద్యా విధానం బట్టి బీటెక్‌లో అవకాశాలు వస్తాయి. సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీసీ, ఎంఎంఈ కోర్సులను ట్రిపుల్‌ఐటీ అందిస్తోంది.

రాష్ట్ర వ్యాప్తంగా పోటీ...

బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఏటా వేల సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ఈ క్యాంపస్‌లో చదివిన విద్యార్థులు భారీ సంఖ్యలో ఉద్యోగాలు సాధిస్తున్నారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ప్రత్యేక ప్యాకేజీలతో కంపెనీలకు ఎంపికవుతున్నారు. దీంతో పిల్లలను ట్రిపుల్‌ఐటీలో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకే ఇక్కడ చదువుకునే అవకాశం దక్కుతుంది.

నేడు నోటిఫికేషన్ విడుదల

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నాం. ప్రవేశాల కోసం విద్యార్థుల అర్హత, చివరి తేదీతో పాటు పలు వివరాలను నోటిఫికేషన్‌లో వెల్లడించనున్నాం. పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

– ప్రొఫెసర్ గోవర్ధన్, ట్రిపుల్‌ఐటీ వీసీ

తీర్థయాత్రలకు ప్రత్యేక రైళ్లు


కిషోర్

ఆదిలాబాద్: తీర్థయాత్రలకు వెళ్లాలనుకునే ప్రయాణికుల కోసం జూన్ 14 నుంచి జూలై 13 వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగ్ రాజ్, శృంగ్వార్‌పూర్ ప్రాంతాలు సందర్శించాలనుకునే వారికి గంగా రామాయణ పుణ్యక్షేత్ర ప్యాకేజీ అందుబాటులో ఉందన్నారు. ఉజ్జయిని, త్రయంబకేశ్వర్, మహాకాళేశ్వర్ వంటి ఐదు జ్యోతిర్లింగాలను దర్శించాలనుకునే ప్రయాణికులకు మరో ప్యాకేజీ అందుబాటులో ఉందని తెలిపారు. ఈ ప్రత్యేక రైళ్లలో ఎన్నో సౌకర్యాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలవారు www. irctctourism.com వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9281030712, 9701360701, 9281495845, 9281030749, 9281030750 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

'నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీలతో అప్రమత్తంగా ఉండాలి'

ఆదిలాబాద్‌టౌన్: నకిలీ ఇన్సూరెన్స్ కంపెనీలతో అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో యూనిక్ మరకన్‌టైన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఇన్సూరెన్స్ కంపెనీ బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం డీఎస్పీ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన బాకే సరిత, దస్నాపూర్‌కు చెందిన అరక అశోక్ సదరు కంపెనీకి దాదాపు రూ.5లక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించారన్నారు. ఇన్సూరెన్స్ పూర్తయినా సదరు ఏజెంట్లు డబ్బులు ఇవ్వకుండా వారికి సమాధానం చెప్పడం లేదన్నారు. దీంతో సంజయ్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సేవసింగ్, అతని భార్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఇన్సూరెన్స్ రెగ్యులారిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ద్వారా ఆమోదించబడిన వాటిలో మాత్రమే ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: అనుమానంతో భార్యను మానసికంగా వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్స్ జడ్జి రాజ్యలక్ష్మి మంగళవారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి వెంకటమ్మ తెలిపారు. బేల మండలంలోని సిర్సన్న గ్రామానికి చెందిన దండెపల్లి నర్సయ్యకు దేవతతో 2003లో వివాహమైంది. 2013లో కుమారుడు జన్మించగా తనకు పుట్టలేదని భార్యను వేధించేవాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి ఇబ్బందులకు గురిచేసేవాడు. దీంతో అతని భార్య 2019 అక్టోబర్ 18న ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి దేవన్న ఫిర్యాదు మేరకు బేల పోలీసు స్టేషన్‌లో అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ షాహిన్ సుల్తానా నేరం రుజువు చేశారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


నారాయణ (ఫైల్)

తాంసి: మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని కప్పర్లకు చెందిన అనుప నారాయణ (32) వ్యవసాయకూలీగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం మద్యం సేవించి పంటచేనుకు వెళ్లాడు. మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని చేను యజమానికి సమాచారం ఇచ్చాడు. యజమాని చేను వద్దకు వెళ్లేసరికి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అంబులెన్సులో రిమ్స్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని భార్య అపర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై రాధిక తెలిపారు.

వివాహం కావడంలేదని యువకుడు..


సుదర్శన్ (ఫైల్)

సోన్: వివాహం కావడంలేదని మనస్తాపంతో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన గోలి సుదర్శన్ (31) ఆరునెలల క్రితం విదేశాల నుంచి తిరిగి వచ్చాడు. తనకు వివాహం కావడంలేదని మనస్తాపంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కె.గోపి తెలిపారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన జావిద్ ఖాన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన అబ్దుల్ అజీజ్ ఇద్దరు కుమారులకు కాంట్రాక్ట్ పద్ధతిలో తహసీల్దార్ కార్యాలయంలో, సిటీ యూనియన్ బ్యాంక్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. వారి వద్ద నుంచి రూ.2లక్షల చొప్పున రూ.4లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. డబ్బులు అడిగితే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ద్విచక్ర వాహనం చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన దార్ల అశోక్ ద్విచక్ర వాహనం మంగళవారం చోరీకి గురైంది. తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

సమయానికి రారు.. పట్టించుకోరు!



హాజీపూర్ పీహెచ్‌సీ లోపల ఖాళీగా దర్శనమిస్తున్న వైనం


పీహెచ్‌సీ ఎదుట ఎదురు చూస్తున్న రోగులు

హాజీపూర్ పీహెచ్‌సీ సిబ్బంది సమయానికి రాకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వైద్యుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఉదయం సమయానికే తాళాలు తీసినా.. సిబ్బంది మాత్రం సమయం దాటాకే వస్తున్నారని, సాయంత్రం కూడా సమయం కాకముందే తాళం వేసి ఎంచక్కా వెళ్లిపోతున్నారని ఆరోపించారు. సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించి వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

నలభీములకు c/o కుభీర్

- మండల కేంద్రంలో 20 బృందాలు
- ఏడాది పొడవునా చేతినిండా పని
- జిల్లాతో పాటు మహారాష్ట్రలోనూ వంటల తయారీ


వంట చేస్తున్న వంటాచార్యుడు

కుభీర్: నిర్మల్ జిల్లాలోని కుభీర్ నలభీములకు (వంట మనుషులకు) ప్రసిద్ధి గాంచింది. మండల కేంద్రంలో సుమారు 20 బృందాలు ఉన్నాయి. ఒక్కో బృందంలో ఒక మాస్టారు, ఇద్దరు లేదా ముగ్గురు సహాయకులు ఉంటారు. అంతేకాకుండా కూరగాయలు కోయడానికి, చపాతీ, పూరీ, లడ్డూ, బాదుషా తయారు చేయడానికి మహిళలను కూలీకి మాట్లాడుకుని వెంట తీసుకెళ్తారు. జిల్లాలోని వివిధ గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు వంటలు చేయడానికి వెళ్తారు. ఒక్కో శుభకార్యానికి మనుషుల లెక్కన రూ.8 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటారు.

ఏడాది పొడవునా పని..

కుభీర్‌కు చెందిన సుమారు 100 మంది మహిళలు, పురుషులకు ఈ రంగంలో ఏడాది పొడవునా ఉపాధి లభిస్తోంది. వెజ్, నాన్‌వెజ్‌తో పాటు లడ్డూ, బాదుషా, జిలేబీ, కాకినాడ కాజా, చపాతీ, పూరీ, మజ్జిగ, కార, బూంద, పాపడాలు, అన్నం, పప్పు, కూరగాయలు.. ఇలా అన్నిరకాల వంటలు చేస్తారు. నాన్‌వెజ్‌లో చికెన్ బిర్యానీ, మటన్ బిర్యానీ, చేపల ఫ్రై, బోటి.. ఇలా అన్నిరకాల వంటలు చేస్తారు. ఇంట్లో శుభకార్యం ఉన్నవారు రెండు నెలల ముందుగానే ఆర్డర్ ఇచ్చి బుక్ చేసుకుంటారు. వారి వద్ద వంటకు సంబంధించిన కొన్ని పాత్రలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తే మరిన్ని పాత్రలు కొనుగోలు చేసుకోవడంతో పాటు మరికొంత మందికి ఉపాధి లభిస్తుందని వారు పేర్కొంటున్నారు.

ప్రధాన వంటాచార్యులు వీరే

కుభీర్‌కు చెందిన ప్రధాన వంటాచార్యులు ఆరె లక్ష్మణ్, కందూర్ పోతన్న, పెద్ద పోతన్న, బత్తిని సాయన్న, మధు, కిని సంతోష్, బ్రాహ్మణ్ శేఖర్, బ్రాహ్మణ్ శేషు, జరి ముత్యం, సిద్దూర్ పోతన్న, పోతాజీ, సాకలి రాందాస్, కొబ్బాజి పోతన్న, బంక బాబు, బ్రాహ్మణ్ రాజు, చవాన్ విశ్వనాథ్, అడెల్లు, సాయినాథ్, గంగాధర్ ఉన్నారు.

చేతినిండా పని



మాకు ఏడాది పొడవునా చేతినిండా పని ఉంటుంది. ఎండాకాలంలో పెళ్లిళ్లు ఎక్కువగా ఉంటాయి. వర్షాకాలం, చలికాలంలోనూ చిన్నచిన్న శుభకార్యాలు ఉంటాయి. నావద్ద ముగ్గురు అనుచరులు ఉన్నారు. అవసరమైనప్పుడు మహిళా కూలీలను కూడా తీసుకుంటాను.

– బ్రాహ్మణ్ శేఖర్, వంటాచార్యుడు, కుభీర్

ప్రభుత్వం ప్రోత్సహించాలి



నేను 20 ఏళ్లుగా వంటలు చేస్తున్నా. ప్రభుత్వం ప్రోత్సాహం అందించి ఆర్థికసాయం అందిస్తే మరిన్ని వంటపాత్రలు కొనుగోలు చేసి మరికొందరికి ఉపాధి కల్పిస్తా.

– ఆరె లక్ష్మణ్, వంటాచార్యుడు, కుభీర్

బాసర ఆలయ హుండీ లెక్కింపు


లెక్కిస్తున్న సేవా సమితి సిబ్బంది

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి 60 రోజుల హుండీ ఆదాయాన్ని మంగళవారం అక్షరాభ్యాస మండపంలో లెక్కించారు. రూ.77,77,746 నగదు, 126 గ్రాముల మిశ్రమ బంగారం, మూడు కిలోల 440 గ్రాముల మిశ్రమ వెండి, 17 విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు.

బాక్సింగ్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్: ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ్‌గౌడ్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఆరుమల్ల రాజు, ప్రధాన కార్యదర్శి కే.దేవేందర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి నగదు అపహరణ


బస్సు వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

రెబ్బెన: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళా ప్రయాణికురాలి హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి నగదు అపహరించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు చింతలమానెపల్లి చెందిన మహిళ మంగళవారం రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ వరకు వచ్చింది. అక్కడి నుండి మంచిర్యాల వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కింది. అయితే కండక్టర్‌కు చూపించేందుకు తన హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న ఆధార్‌కార్డును తీసేందుకు బ్యాగు తెరవగా అందులో ఉన్న రూ.15వేలు కనిపించలేదు. దీంతో బస్సును దేవుల గూడ వద్ద ఆపి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది బస్సులో ఉన్న ప్రయాణికులందరి బ్యాగులను తనిఖీ చేసినా డబ్బులు లభించలేదు. అయితే రెబ్బెన బస్‌స్టాప్‌లో కొంతమంది ప్రయాణికులు బస్సు దిగిపోయారని, వారిలోనే డబ్బులను చోరీ చేసిన వారు ఉండి ఉంటారని పోలీసులు భావించారు. ఘటనతో మంచిర్యాలకు వెళ్లే ప్రయాణికులు సుమారు 1:15 గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ విషయమై ఎస్సై చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఘటనపై బాధితురాలు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 18న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–25 జిల్లా ఎంపిక పోటీలు నిర్వహించారు. 200ల మంది క్రీడాకారులు పాల్గొనగా 90 మందిని ఎంపిక చేసి ఆరు టీంలుగా విభజించారు. ప్రతీ టీంను మిగిలిన అన్ని టీంలతో రెండు రోజుల పాటు ఆడించాలని భావించగా వర్షంతో వాయిదా పడింది. మంగళవారం జిల్లాలోని మూడు మైదానాల్లో ఎంపిక పోటీలు నిర్వహించినట్లు హెచ్‌సీఎల్ సెక్రటరీ కోదాటి ప్రదీప్, కోచ్ పి.ప్రదీప్ తెలిపారు. మంచిర్యాలలోని ఉషోదయ పాఠశాల, గుడిపేట 13వ పోలీసు బెటాలియన్ మైదానం, మందమర్రిలోని సింగరేణి మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆరు టీంలలో ప్రతిభ కనబర్చిన వారిని ఒక టీంగా చేసి, వారిని ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు.

తుర్కం చెరువును సందర్శించిన ట్రైనీ అటవీ అధికారులు


తుర్కం చెరువు వద్ద ట్రైనీ ఫారెస్ట్ బీట్ అధికారులు

మామడ: మండలంలోని ఎకో టూరిజం సందర్శన కేంద్రం అయిన తుర్కం చెరువును ట్రైనీ అటవీ అధికారులు శిక్షణలో భాగంగా మంగళవారం సందర్శించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన 42 మంది ట్రైనీ బీట్ అధికారులు తుర్కం చెరువుతోపాటు యెంగన్న చెరువు వద్ద వలస పక్షులను ప్రత్యేక కెమెరాలతో వీక్షించారు. చెరువులకు వస్తున్న పక్షుల రకాల గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. అడవిలో పెరుగుతున్న మొక్కల రకాలను తెలుసుకున్నారు. వారివెంట ఎఫ్ఆర్వోలు శ్రీనివాస్‌రావు, స్వరూప, ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్, పీడీ కొండల్‌రావు ఉన్నారు.